క్లుప్తంగా

ఈవోపీఆర్‌డీగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్‌కి పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

చింతపల్లిరూరల్: చింతపల్లి ఈవోపీఆర్‌డీగా శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నర్సీపట్నం ఈఈపీఆర్ఐ డివిజన్ కార్యలయంలో సినియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవి ఉన్నతిలో భాగంగా చింతపల్లి ఈవోపీఆర్‌డీగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పనిచేశారు. పూర్తి స్థాయి ఈవోపీఆర్‌డీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

దాకరాయిలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాజవొమ్మంగి: మండలంలోని దాకరాయి గ్రామంలో బుధవారం రాజవొమ్మంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ లిఖిత ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 41 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్టు తెలిపారు. వీరిలో నలుగురు గర్భిణులు ఉండగా వారిని వైద్య పర్యవేక్షణలో ఉంచామన్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. బీపీ సమస్య వున్న 20 మందికి, 11 మంది సుగర్ వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు అందజేశామన్నారు.

నేడు ప్రజావేదిక

అరకులోయ రూరల్: మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల ప్రజావేదిక బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో నగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 14 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులకు సంబంధించి ఈనెల 8 నుంచి సామాజిక తనిఖీ కార్యక్రమాలు జరిగాయని, ఈ మేరకు ఆయా పనుల్లో అవకతవకలపై ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా సంబంధిత వేతనదారులు వచ్చి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

టీఎస్‌పీ నిధులతో ఆటోలు

కొయ్యూరు: డ్వాక్రా గ్రూపులకు వడ్డీలేని రుణంతో ఇస్తున్న ఆటోల కోసం ఈ నెల 25తేదీ లోగా వెలుగు కార్యాలయంలో దరఖాస్తు చేయాలని ఏపీఎం శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఎస్టీ, ఎస్సీ డ్వాక్రా మహిళలకు గిరిజన ఉప ప్రణాళిక(టీఎస్‌పీ) నిధులతో ఆటోను అందజేస్తారన్నారు. పది శాతం రూ.33,519 నిలబ్దిదారులు చెల్లించాలని సూచించారు.నేరుగా ఆటోను కొనుగోలు చేసి ఇస్తామన్నారు. నగదు లబ్దిదారునికి ఇవ్వడం జరగదని ఆయన పేర్కొన్నారు.25నాటికి ఆధార్ సహా డ్రైవింగ్ లైసెన్స్‌ఉన్నవారు గ్రూపు పొదుపు పుస్తకం తీసుకురావాలని ఆయన సూచించారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



బందవీధిలో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ చిలకమ్మ

జి.మాడుగుల: పాడేరు–జి.మాడుగుల మధ్య కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి గ్రామంలో డ్రైనేజీ పనులను సర్పంచ్ మాతే చిలకమ్మ, వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ వెంకటరమణ బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ మార్గంలో డ్రైనేజీ లేక వర్షపు నీరు నిలిచిపోతుందని, ఈ మార్గంలో గోతులతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారానికి పంచాయతీ నిధుల ద్వారా డ్రైనేజీ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. వార్డు సభ్యులు బొంజుబాబు, తిరుపతిరావు, గ్రామ వలంటీర్ రాయుడు, ఎండీయూ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

బంతి సాగు.. లాభాలు బాగు



విరబూసిన బంతి



బంతిపూల సాగును పరిశీలిస్తున్న విద్యార్థులు

చింతపల్లి రూరల్: గిరిజన ప్రాంతం ప్రకృతి అందాలకు నిలయం. ఇక్కడి వాతావరణం పూల సాగుకు అనుకూలం. ఈ ప్రాంతంలో వివిధ రకాల ప్రత్యేక పుష్పాలు సాగులో ఉన్నాయి. ఏజెన్సీ బంతి పూలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. మండలంలోని చౌడుపల్లి, లంబసింగి, పెదబరడ తదితర ప్రాంతాల్లో బంతిపూలు సాగులో ఉన్నాయి. హైబ్రిడ్ బంతిపూలు మండలంలోని సుమారు రెండు ఎకరాల్లో, ఏజెన్సీ బంతిపూలు సుమారు 10 నుంచి 13 ఎకరాల్లో సాగులో ఉన్నట్టు అధికార లెక్కలు చెబుతున్నాయి. మండల కేంద్రంతో పాటు జి.మాడుగుల తదితర మండలాల్లోని వారపు సంతల్లో బంతిపూల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. ప్రస్తుతం సీజన్ కావడంతో బంతి పూల మార్కెట్ ఊపందుకుంది. విశాఖపట్నం, నర్సీపట్నం, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి నేరుగా రైతుల నుంచి ఆయా సంతల్లో మార్కెట్‌ల నుంచి కొనుగోలు చేసుకొని వెళ్తున్నారు. బంతిపూలు కిలో రూ.50 నుంచి సైజు డిమాండ్ బట్టి రూ.65 వరకు విక్రయాలు జరుగుతున్నాయి. బంతిపూల పంటలకు తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలు ఉండడంతో గిరిజన రైతులు సాగుకు మొగ్గు చూపిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. ఇందులో భాగంగానే చౌడుపల్లికి చెందిన అభ్యుదయ రైతు కంత రమణ తన రెండు ఎకరాల్లో బంతి సాగు చేశారు. పూల సాగుకు సుమారు రూ.70వేలు కాగా, ఎకరాకు సుమారు రెండు టన్నుల దిగుబడి వచ్చినట్టు ఆయన చెప్పారు. లక్ష రూపాయలకు పైగానే ఆదాయం వచ్చినట్టు తెలిపారు. మరో టన్ను మార్కెట్‌కు సిద్ధంగా ఉన్నట్టు ఆయన చెబుతున్నారు. పూలను స్థానిక పూలదుకాణాలకు, లేదా నర్సీపట్నం కి మార్కెట్‌కి పంపుతున్నారు. బంతి పూల సాగుపై స్థానిక ఏడీఆర్ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటు స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో చదువుతున్న విద్యార్థులకు బంతి పూల సాగులో మెలకువలు, మార్కెటింగ్ తదితర విషయాలపై విద్యార్థులకు తెలియజేస్తున్నారు.

మార్కెటింగ్ సులువు



బంతిపూలను పండించడం చాలా సులువు. రైతులు వరి, మొక్క జొన్నలు, వెరుశేనగతో వంటి పంటలతో పాటు బంతి పూల సాగుపై కుడా దృష్టి పెట్టాలి. మంచి లాభాలు అందించడంలో బంతిపూల మార్కెట్ చాలా సులభం.

– కంటా బాలకర్ణ, ఉద్యానవన శాఖాధికారి

రహదారి పనులకు శంకుస్థాపన



అప్పలరాజుపేటలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న గ్రామస్తులు



విండెలవారి వీధిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలో బుధవారం రహదారి పనులను స్థానికులు ప్రారంభించారు. రాజవొమ్మంగి నుంచి అప్పలరాజుపేట వరకు సుమారు కోటి రూపాయలతో రహదారి నిర్మిస్తున్నారు. రహదారి కోసం కృషి చేసిన ఎమ్మెల్యే ధనలక్ష్మికు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ చీడిపల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ యూత్ లీడర్ కనిగిరి వీరబాబు, గిరిజన సంక్షేమ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని దాలిపాడు సచివాలయం పరిధిలోని విండెలవారి వీధిలో సుమారు రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు బుధవారం ప్రజాప్రతినిధులు, నాయకులు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు గుడ్ల త్రిమూర్తులు, మండల పార్టీ కన్వీనర్ మామిడి అప్పారావు, మండల సచివాలయాల కన్వీనర్ కరణం కనకరాజు, సర్పంచ్ కర్ర వెంకాయమ్మ, నాయకులు రమేష్,నూకరాజు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లుపై హర్షం

గంగవరం: కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడంపై వివిధ పార్టీలకు చెందిన మహిళా నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గంగవరం జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్ ఎంపీపీలు రామతులసీ, గంగాదేవి, బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి సత్యనారాయణమ్మ, మాజీ ఎంపీపీ తీగల ప్రభ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంఈవో–2గా వసంతరావు

కొయ్యూరు: మండలానికి సంబంధించి రెండో ఎంఈవోగా బాలారం జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న వసంతరావును నియమించారు. కొయ్యూరు ఎంఈవో–1 గా రాంబాబు వ్యవహరిస్తున్నారు. కాగా ఇప్పటివరకు ఎంఈవో–2 ఇన్‌చార్జిగా చేసిన బోడంనాయుడును చింతపల్లికి బదిలీ చేశారు. ప్రస్తుతం జెడ్పీ పాఠశాలకు చెందిన వసంతరావును ఎంఈవో–2గా నియమించారు.

భారీ అన్నసమారాధన



అన్నదానంలో భక్తులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో స్థానిక మోటర్ యూనియన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా బుధవారం భారీ అన్నదానం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేసి, ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. మోటార్ యూనియన్ అధ్యక్షుడు నాగార్జున, నాయకులు యాసీన్, మొహిద్దీన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం



జి.మాడుగులలో గణేష్ నిమజ్జన ఊరేగింపులో థింసా నృత్యం

జి.మాడుగుల: జిల్లాలో పలు చోట్ల వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. జి.మాడుగుల మండల కేంద్రంలో వినాయక నిమజ్జనం కార్యక్రమంలో థింసా నృత్యాలతో యువత సందడి చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు మత్స్యరాస విజయకుమారి, సర్పంచ్ కిముడు రాంబాబు నగదు, షీల్డు బహుమతులను అందజేశారు. పోటీల్లో బి.హరిహరన్, సంతోష్ కుమారిలకు ప్రథమ బహుమతిగా రూ.5,000 నగదు, షీల్డు, గావెలి శ్రీనుకి ద్వితీయ బహుమతిగా రూ.3,000నగదు, షీల్డు, మూడవ బహుమతిగాదేవి శ్రీసాయికి రూ.2,000నగదు, షీల్డు, కె.సౌజన్యకి నాలుగోవ బహుమతిగా రూ.1,000నగదు, షీల్డులను అందజేశారు. స్థానిక దేవుని గెడ్డలో వినాయకుని నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ నాయకులు నారాయణరాజు, రామకృష్ణంరాజు, గిరి, ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు తదితరలు పాల్గొన్నారు. వినాయకుని లడ్డూకు వేలం పాట ఉత్సవంగా జరిగింది. లడ్డూ వేలం పాటలో కూడా నారాయణరావు కుమారుడు కెవీ వరప్రసాద్ రూ.5వేలకు దక్కించుకున్నారు.

ముంచంగిపుట్టు/పెదబయలు: ముంచంగిపుట్టు మండలం కించాయిపుట్టు పంచాయతీ పెద్దాపుట్టు గ్రామంలో వినాయక నిమజ్జన కార్యక్రమం గిరిజన సంప్రదాయ నృత్యాలు బాణసంచా కాలుస్తూ ఊరేగింపుగా సుజనకోట మత్యగెడ్డలో నిమజ్జనం చేశారు. సెల్లుంగిపుట్టు గ్రామస్తులు కూడా ఇక్కడే నిమజ్జం చేశారు. పెదబయలు మండలం వెల్లపాలెం గ్రామంలో భారీ అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కృష్ణారావు, నాయకులు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలోని నిమజ్జన ఊరేగింపులో గురుకుల పాఠశాల విద్యార్థినులు

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు బుధవారం నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. తాము ప్రతిష్ఠించి, పూజలు జరిపిన గణనాథుడిని పిల్లలు సమీప కొండ కాలువకు ఊరేగింపుగా తీసుకొని వెళ్లి నిమజ్జనం చేశారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయకునికి పూజలు



జోగులపుట్టులో పూజలు చేస్తున్న సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ సన్యాసిదొర

జి.మాడుగుల: మండలంలో జోగులపుట్టులో బుధవారం సర్పంచ్ కిముడు రాంబాబు, లువ్వాసింగి ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర తదితరులు స్థానిక సిద్ధి వినాయకుని ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో వినాయక చవితి ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు సర్పంచ్, ఎంపీటీసీలు ఉత్సవమూర్తికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గ్రామస్తులందరు కలసికట్టుగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు వారు చెప్పారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, రోజూ పూజా కార్యక్రమాలు చేపడుతున్నామని, పలు సాంస్కృతి కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

శంకరం మాస్టారు సేవలు మరువలేనివి



సీకరిలో లలితశంకరం మాస్టారు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: మంచి ఉన్నత విలువలు కలిగిన ఉత్తమ ఉపాధ్యాయుడిని కోల్పోయామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. పెదబయలు మండలం గంపరాయి పంచాయతీ చీడిపుట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఈనెల 8న తరగతి గదిలోనే గుండెపోటుతో మృతి చెందిన జంపరంగి లలిత శంకరం మాస్టారు సంస్మరణ కార్యక్రమం సీకరిలో బుధవారం జరిగింద. కార్యక్రమానికి హాజరైన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ లలితశంకరం మాస్టారు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో మాట్లాడుతూ మాస్టారు లలిత శంకరం తన కుటుంబం కంటే ఎక్కువగా వృత్తిని ప్రేమించేవారని, నిత్యం అతను పని చేస్తున్న పాఠశాల, గ్రామంలోని పిల్లల అభ్యున్నతి కోసం ఎక్కువ సమయం కేటాయించేవారని గుర్తు చేశారు. శివారు గ్రామాల్లో కనీస సదుపాయాలు లేని పాఠశాలలకు బదిలీపై వెళ్లి ఉత్తమ సేవలందించి, అధికారుల మన్ననల ద్వారా తన కృషితో పాఠశాల రూపురేఖలు మార్పునకు లలిత శంకరం కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తితో పాటుగా సామాజిక కార్యక్రమాలను గ్రామస్తులను మమేకం చేసేవారని, అందరికి ఆదర్శ ప్రాయమన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కూడ బొంజుబాబు, రాష్ట్ర అగ్రో డైరెక్టర్ వనల్ప సన్యాసి, సర్పంచ్ కృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, చోడవరం ఎంఈవో సింహాచలం, మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలం



సాక్షి,పాడేరు: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి ఇంటి పెరటిలో బ్రహ్మకమలం పుష్పాలు విరగ్గాశాయి. అడ్డతీగల మండలంలోని రాజంపాలెంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి తన స్వగృహం పెరటిలో అనేక రకాల పూలమొక్కలను పెంచుతున్నారు. ఇందులో బ్రహ్మకమలం మొక్కలు కూడా ఉన్నాయి. అయితే ఈ ఏడాది కూడా బ్రహ్మకమలం పుష్పాలు విరగ్గాయడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విరబూసిన బ్రహ్మకమలం పుష్పాలు చూసేందుకు స్థానికులు ఎగబడుతున్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ చిన్నారావు, నాయకులు

అరకులోయ రూరల్: మండలంలోని కొత్తభల్లుగుడ పంచాయతీ కొర్రగూడలో పార్టీ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెదలబుడు మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాంగి చిన్నారావు మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతం కోసం అందరూ సమష్టిగా పనిచేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేసి, అర్హులందరికీ మంజూరు అయ్యేలా చూడాలన్నారు. గ్రామ వలంటీర్ల వ్యవస్థతో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి జరిగాయన్నారు. మాజీ జెడ్పీటీసీ కాసులమ్మ, మాజీ ఎంపీపీ అరుణకుమారి, మాజీ సర్పంచ్‌లు అప్పలరాజు, ప్రకాష్, ప్రసాద్, నాయకులు రఘునాథ్, అప్పాలు, పరుశురాం, సుందర్‌రావు, అశోక్‌కుమార్, రామ్మూర్తి, రామానాయుడు, గురునాయుడు, సుంద్ర, విజయ్‌కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు రక్షణ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉమామహేశ్వర రావు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ చేపట్టనున్న ఉక్కు రక్షణ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తుందని, అందరూ అడ్డుకోవాలని, అన్ని వర్గాల ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ చేపట్టనున్న ఉక్కు రక్షణ యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. గిరిజనులంతా ఉక్కు రక్షణ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రామరావు, మగ్గన్న, బుజ్జిబాబు, జోషి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

జి.మాడుగుల: మండలంలోని గెమ్మెలి సచివాలయ పరిధిలో బుధవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ చేయూత లబ్దిదారులకు అవగాహన గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ చేయూత పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలకు జీవనోపాధికి భరోసా ఇచ్చారని, దీన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్ చేయూత పథకానికి 45 సంవత్సరాల వయస్సు గల ప్రతి ఒక్క మహిళ అర్హులని ఆయన తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సొమ్మును కిరణా, మేకలు, గొర్రెలు పెంపకం, వ్యవసాయం, కూరగాయలు వ్యాపారాలకు, విద్య, ఆరోగ్యం వంటి అవసరాలకు వినియోగించుకోవాలన్నారు. స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. క్లస్టర్ సీసీ స్వామినాయుడు, వెలుగు వీవోఏలు మహేష్, సూర్యనారాయణ, సత్యనారాయణ, సింహచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



ఎటపాకలో సీమంతాలు నిర్వహిస్తున్న సిబ్బంది



ఇందుకూరుపేటలో సీమంతంలో పాల్గొన్న ఎంపీపీ మురళీ, జెడ్పీటీసీ సత్యవేణి తదితరులు

ఎటపాక: మండలంలోని గొల్లగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషక మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కన్నాయిగూడెం ఎంపీటీసీ సభ్యుడు వర్స బాలకృష్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణీలు, బాలింతులు, చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ శివబాబు, సూపర్‌వైజర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కుంజం మురళీ, జడ్పీటీసీ శిరశం సత్యవేణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహార పదార్థాలను క్రమం తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. నలుగురు బాలింతలకు సీమంతం నిర్వహించారు. సీడీపీవో సంధ్య, ఎంపీడీవో రత్నకుమారి, నాయకులు బాబ్జి, మురళీకృష్ణ, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.



శరభవరం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీవో దేవమణి

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సీడీపీవో దేవమణి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోని రక్త హీనత తదితర సమస్యల నుంచి బయటపడేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మునగ, తోటకూర వంటి ఆకుకూరలు, బొప్పాయి పండ్లు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. వివిధ రకాల పౌష్టికాహారపదార్థాలను ప్రదర్శనగా పెట్టి అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, పప్పులతో రూపొందించిన పౌష్టికాహార వారోత్సవాల లోగో ఆకట్టుకొంది. సర్పంచ్ రాజ్యలక్ష్మి, క్లస్టర్ సూపర్‌వైజర్ అమ్మాజి, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందనలు



ట్రైనింగ్ పత్రాలను చూపిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, చిత్రంలో రాజవొమ్మంగి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్ఎం

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ (18ఏ బ్యాచ్) క్యాడెట్ల ఆర్మీ ట్రైనింగ్ పూర్తయింది. ఫైరింగ్, బాడీ ఫిట్‌నెస్, కరాటే, సెల్యూట్ తదితర అంశాలపై రాజానగరం గైట్ కళాశాలలో 18 రోజుల ఆర్మీ శిక్షణ పూర్తి చేసుకున్నట్టు ఎన్‌సీసీ టీచర్ చింతోజి శివకృష్ణ తెలిపారు. శిక్షణ అనంతరం కమాండెంట్/ కల్నల్ వివేక్ సావన్‌గౌడర్ చేతుల మీదుగా విద్యార్థులు ఎన్‌సీసీ సర్టిఫికెట్లు అందుకున్నారన్నారు. ఈ శిక్షణకు పాఠశాల నుంచి 18 మంది బాలికలు, 24 మంది బాలురు హాజరైనట్టు చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థులను హెచ్ఎం గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సూర్యనారాయణ, ఉదయ్ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ పాటు దేశభక్తి కలిగి ఉండాలన్నారు.

గిరిజన సమస్యలపై ఉన్నతాధికారులకు వినతి

పాడేరు రూరల్ : గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా ఉన్నత శాఖాధికారులకు వినతిపత్రాలు అందజేసినట్టు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పసుపులేటి బాలరాజు బుధవారం తెలిపారు. ఈ మేరకు పాడేరు నుంచి అనంతగిరి, కొయ్యూరు, రంపచోడవరం, కూనవరం, చింతూరు, సీలేరుకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని, వీధి దీపాల నిర్వహణతో పాటు చింతపల్లిలో బీసీ వసతిగృహంలో సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్‌కు కోరానన్నారు. వారు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని స్పష్టం చేశారు.